క్లుప్తంగా

సత్తెమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ



కరెన్సీ అలంకరణలో అమ్మవారు

ముమ్మిడివరం: ఆషాఢమాసం నాలుగో ఆదివారం కావడంతో సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారిని కరెన్సీతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు., కోనసీమ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం



పి.మల్లవరంలో ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మవారు

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతరను డప్పుల వాయిద్యాలు, గరగ నృత్యాలతో శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూలమాలలు, విద్యుద్దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులతో పి.మల్లవరం జనంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విళ్ల సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సహాయం

తాళ్లరేవు: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద విద్యార్థినికి పి.మల్లవరం మాజీ సర్పంచ్, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆర్థిక సహాయం అందించారు. కోరంగి పంచాయతీ సీతారామపురానికి చెందిన మారిశెట్టి సౌమ్య కాకినాడలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుతోంది. సౌమ్య తండ్రి మృతి చెందడంతో ఫీజు చెల్లించలేక చదువుకు దూరమైంది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు శివన్నారాయణకు తెలియజేయడంతో ఆయన స్పందించి రూ.10 వేలు విద్యార్థినికి అందజేసారు. నాయకులు అత్తిలి బాబూరావు, వాసంశెట్టి శ్రీనివాస్, దాసరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు



అమలాపురం ప్రధాన రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద మలుపు నుంచి ఈదరపల్లి వంతెన వరకూ ప్రధాన రోడ్డు వెంబడి మురుగునీటి కష్టాలు ఎక్కువై ప్రజలతోపాటు వాహన చోదకులు తీవ్ర అసౌర్యానికి గురవుతున్నారు. వర్షం వస్తే చాలు ఇక్కడ ప్రధాన రోడ్డుపై ముంపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. వర్షం ఆగిన కొన్ని గంటల వరకూ ముంపు నీటి సమస్య నెలకొనడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని రోజుల పాటు ఆ రోడ్డు మార్జిన్ వెంబడి మురుగునీరు నిల్వ ఉంటోంది. ఈ రోడ్డు వెంబడి పెట్రోలు బంక్‌ల స్థలాలను ఎత్తు చేయడంతోపాటు డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపై ముంపునీరు నిలిచిపోతోంది. డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం రూరల్: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యను వెంటనే పరిష్కరించి, జీతాలు సక్రమంగా చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్ర కుమార్, ఎంటీఎస్ సుబ్బారావు డిమాండ్ చేశారు. అమలాపురం యూటీఎఫ్ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి ఇప్పటికీ రెండు నెలలు పూర్తి కావస్తున్నా బదిలీ అయిన ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఉపాధ్యాయులపై పని భారం తగ్గించాలని కోరారు.

నారు దశ.. జాగ్రత్తలే రక్ష

- సార్వా సాగు పనుల్లో రైతులు నిమగ్నం
- అప్రమత్తంగా లేకుంటే దిగుబడిపై ప్రభావం
- నారు సస్యరక్షణ ప్రధానమంటున్న వ్యవసాయాధికారులు



ఏపుగా పెరుగుతున్న నారుమడి



నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపడుతున్న రైతులు

ముమ్మిడివరం: వరి సాగులో ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడి సాధించి వ్యవసాయం లాభసాటిగా మార్చుకోవడానికి ఆరోగ్యవంతమైన నారు కీలకం. ఆరోగ్యకరమైన నారు కోసం నారుమడి తయారీ నుంచి ఎంతో జాగ్రత్త, ఆది నుంచి అప్రమత్తత అవసరం. నిర్లక్ష్యంగా ఉంటే పంట దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం రైతులు సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. నారుమడుల తయారీ, విత్తనాలు చల్లుకోవడం నారు సంరక్షణ పనుల్లో బిజీగా ఉన్నారు. కొన్ని చోట్ల నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో నారుమడి తయారీ సస్యరక్షణ చర్యల్లో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

నారుమడి తయారీలో పాటించాల్సిన జాగ్రత్తలు

నారుమడి చేయడానికి ఎంచుకున్న పొలం మెరకలో ఉండి సారవంతమైనదిగా ఉండాలి. పొలాన్ని బాగా దుక్కిదున్ని కలుపు లేకుండా చూసుకోవాలి, వీలైనంత వరకూ బాగా చివికిన సేంద్రియ ఎరువును ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. అందువల్ల వేరు వ్యవస్థ బలంగా తయారై నారు తీసేటప్పుడు వేర్లు తెగిపోకుండా ఉంటుంది. మొక్కకు అన్నిరకాల పోషకాలు పుష్కలంగా అంది మొక్క ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడుసార్లు దమ్ముచేసి చదును చేసి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.

ఎకరా పొలానికి 5 సెంట్ల నారుమడి

ఎకరా పొలంలో నాట్లు వేయడానికి 5 సెంట్లు నారుమడి సరిపోతుంది. 5 కిలోల చిత్తనాలను ఒక లీరు నీటిలో ఒక గ్రాము కార్బన్‌డిజం కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి, మొలకలు వచ్చిన తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నారు ఆకు పూర్తిగా విచ్చుకునే వరకూ ఆరుతడులు ఇచ్చుకోవాలి. తర్వాత పలుచగా నీరు పెట్టాలి.

పోషక యాజమాన్యం తప్పని సరి

ఎకరా నారుమడికి 6 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, 1.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దమ్ములో వేయాలి. రెండు కిలోల యూరియాను విత్తనాలు చల్లేముందు ఒక కిలో యూరియా విత్తన 10రోజుల తరువాత వేసుకోవాలి. దీనివలన నారు బలంగా పెరుగుతుంది. నారు మడిలో ఇనుపధాతు లోపం కనిపిస్తే లేత చిగురు ఆకులపై ఇటుక రంగు మచ్చలు ఏర్పడి నారు నిర్జీవంగా మారి ఎదుగుదల ఉండదు. దీని నివారణకు లీటరు నీటిలో 20 గ్రాముల అన్న బేధి, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపిన ద్రావణం పిచికారీ చేసుకోవాలి.

కలుపు నివారణపై దృష్టి సారించాలి

నారుమడిలో కలుపు మొక్కలు కనిపిస్తే సాధారణంగా చిన్న కమతాల నారుమడుల్లో కలుపును రైతులు లేదా కూలీలతో తొలగిస్తారు. పెద్ద కమతాల రైతులు మాత్రం కలుపు నివారణకు రసాయనాలు ఉపయోగించవచ్చు. నారుమడిలో ఊద, ఇతర కలుపుజాతి ఉంటే నివారణకు ఎకరా నారుమడికి 400 మి.లీ సైహలోఫాస్ బ్యూటైల్ 10 శాతం మందును 200 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ మందు పిచికారీ చేసిన వారం రోజుల్లో ఊద, గడ్డిజాతి మొక్కలు మాత్రమే నశిస్తాయి.నారుకు ఎలాంటి నష్టం ఉండదు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరా నారు మడికి 160 గ్రాముల చొప్పున వేసుకోవాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరిఫైరిపాస్ 2.0 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి విత్తిన 10రోజులకు 17రోజులకు పిచికారీ చేసుకోవాలి. నారు తీయడానికి 7రోజుల ముందు సెంటు నారు మడిలో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 2జి గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి చల్లుకోవాలి.

– ఎస్. ప్రశాంతకుమార్, ఏఓ, ముమ్మిడివరం

చంద్రబాబు పాలనపై పెరుగుతున్న ప్రజావ్యతిరేకత




కాట్రేనికోనలో వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటసతీష్‌కుమార్

కాట్రేనికోన: రైతులను, మత్స్యకారులను, నిరుద్యోగులను, మహిళలను దారుణంగా మోసం చేసిన చంద్రబాబు పాలనపై ప్రజావ్యతిరేకత పెరుగుతోందని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేందుకు గ్రామస్థాయిలో శక్తివంచన లేకుండా పనిచేసి వైఎస్ జగన్ మోహనరెడ్డిని రెండవసారి రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయడం ఒక్కటే మనందరి జెండా..అజెండా అని పొన్నాడ అన్నారు. కాట్రేనికోన గ్రంధి నారాయణ మూర్తి కల్యాణ మండపంలో ఆదివారం మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ మండల స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణతో పాటు పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు కాశి బాలకుమారి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా పొన్నాడ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని, బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాబు సూపర్ సిక్స్ హామీలు మోసపూరితమైనవని ప్రజలు గుర్తించారని అన్నారు. పింఛన్లు తొలగించారని, ఉచిత బస్సు హామీని విస్మరించారని, తల్లికి వందనం కొందరికే అందించారని విమర్శించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించేందుకు సుమారు 120 మంచి నీటి ట్యాంకులు, మంచి నీటి ప్రాజెక్టులు నిర్మించి రక్షిత మంచి నీటిని అందించామన్నారు. మగసానితిప్ప గ్రామానికి 8 కిలోమీటర్ల పైపులైన్ పనులు చేపట్టి రక్షిత మంచి నీటిని అందించామన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న నాయకులను గుర్తించి గ్రామ కమిటీ అధ్యక్షులు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను గుండెల్లో పెట్టుకుంటానన్నారు. ఈ సందర్భంగా పొన్నాడ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో అబ్జర్వర్ మాతా మురళి, జెడ్పీటీసీ నేల కిషోర్, ఏడిది చక్రపాణీరావు, తటవర్తి వెంకట రత్నం, నడింపల్లి సూరిబాబు, పెయ్యల చిట్టిబాబు, కోలాటి సత్యం, నాతి సత్యనారాయణ, గంటి వెంకట సుధాకర్, కాశి హనుమంతరావు, పాలెపు ధర్మారావు, కాశి రామకృష్ణ, వాసంశెట్టి శ్రీనివాసరావు, మల్లాడి బాబ్జి, ఏడు కొండలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాము కార్టూన్‌కు జాతీయ బహుమతి



వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము



బహుమతి సాధించిన మాడా రాము గీసిన కార్టూన్

అమలాపురం రూరల్: విశాలాక్షి సాహిత్య మాసపత్రిక 16వ వార్షికోత్సవం సందర్భంగా మామిడిపూడి రామకృష్ణయ్య స్మారక జాతీయస్థాయి కార్టూన్ల పోటీల్లో అమలాపురం రూరల్ బండారులంకకు చెందిన వ్యంగ్య చిత్రకారుడు, మాడా రాము గీసిన కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. 170 ఎంట్రీలు ఈ పోటీకి వచ్చినట్టు సంపాదకుడు ఈతకోట సుబ్బారావు ప్రకటించారని రాము తెలిపారు. ఆదివారం నెల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో విశాలాక్షి విరిజల్లులు పేరుతో బహుమతి పొందిన కార్టూన్ల సంకలనాన్ని పబ్లిషర్ కోసూరి రత్నం, ఎడిటర్ సుబ్బారావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, శతాధిక గ్రంథకర్త జీవీ పూర్ణచంద్, నెల్లూరు 25 సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తదితరులు విడుదల చేసి, వ్యంగ్య చిత్రకారులను అభినందించారు.

విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించండి



వానపల్లిపాలెంలో విద్యుత్ తీగ సమీపంలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించాలని కోరుతూ వానపల్లిపాలెం గ్రామస్తులు ఆదివారం నిరసన తెలిపారు. గ్రామంలో 11కేవీ విద్యుత్ సరఫరా అయ్యే తీగలున్న ఇనుప స్తంభం తుప్పుపట్టి నేలకొరగడంతో తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయని వారన్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంగా ఉందని వానపల్లిపాలెం గ్రామ ప్రజలు అన్నారు. విద్యుత్ శాఖాధికారుల తీరుపై ఆదివారం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. వానపల్లిపాలెం పంచాయతీ పరిధి బీవీ రమణయ్య నగర్ దళితులు నివసించే ప్రాంతంలో 15 రోజుల క్రితం వరి చేలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం తుప్పు పట్టి నేలపై విరిగిపడింది. స్థానిక విద్యుత్ సిబ్బందికి గ్రామస్తులు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి చిన్న కర్రను పాతి 11 కేవీ మెయిన్ లైన్ సర్వీస్ తీగలను ఆ కర్రకు జత చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విరిగిపడిన స్తంభం వద్ద ఆందోళన చేపట్టారు. స్తంభం విరిగినచోట వేరే స్తంభాన్ని ఏర్పాటు చేయకుండా విద్యుత్ శాఖాధికారులు తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై విద్యుత్ శాఖాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు సమాచారం అందించినా పట్టించుకున్న దాఖలాల్లేవని వారు వాపోతున్నారు. గాలి వీచి వర్షం కురిసినప్పుడల్లా షార్ట్ సర్క్యూట్‌కు గురై విలువైన ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జొన్నాడ వెంకటరమణ, పినిపే నాగేశ్వరరావు, మోకా దుర్గారావు, మెండి ప్రజ్ఞ కుమార్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఘనంగా ఆషాఢ సారె

ఐ.పోలవరం: కేసనకుర్రులోని మల్లమాంబ దేవికి ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్, వివిధ గ్రామాల భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢం సారె సమర్పించారు. మహిళలు గ్రామస్తులు విద్యార్థులు అమ్మవారికి సారె, పసుపు నీళ్ల బిందెలతో జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం నుంచి శోభాయాత్రగా పయనమయ్యారు. అమ్మవారికి కుంకుమార్చన అనంతరం సారె సమర్పించారు. సలాది శేషారావు, పిన్నమరాజు పెద్దబాబు, ఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ జి.విశ్వనాథ రాజు, చింతా వివేక్, చిక్కం రాంబాబు, వనచర్ల వెంకటేశ్వరరావు, వై.వెంకటరమణ, వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్లకు పూజలు

ఐ.పోలవరం: అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమం మురమళ్లలో ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయం నుంచి గ్రామ దేవతలైన మాణిక్యాంబ అమ్మవారు, కనక మహాలక్ష్మి అమ్మవార్లకు సారె సమర్పణ కార్యక్రమం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు దంపతులు ప్రప్రథమంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నలుమూలల నుంచి భక్తులు, మహిళలు తరలివచ్చి అమ్మ వార్లకు సారె సమర్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి. సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మాణిక్యాంబ అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మాణిక్యాంబ అమ్మవారిని శాకంబరిగా, కనకమహాలక్ష్మిని విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాలే రాజబాబు, ధూళిపూడి చక్రం, గ్రామ పెద్దలు, గ్రామమస్తులు, లలితా మహిళ భక్త మండలి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలిమిడి, బెల్లం పానకం సమర్పణ

అమలాపురం టౌన్: పట్టణంలోని సుబ్బాలమ్మకు, నల్లా వీధిలోని విజయ దుర్గమ్మకు నల్లా వీధి భక్తులు



తాండవపల్లిలో వనువులమ్మకు భక్తులు సమర్పించిన సారె

ఆషాఢ సారెను సమర్పించి ఆదివారం మొక్కలు తీర్చుకున్నారు. చలిమిడి, బెల్లం పానకం, మిఠాయిలను భక్తులు కావిళ్లతో ఊరేగింపుగా ఆలయాలకు తీసుకువచ్చారు. మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ, మాజీ కౌన్సిలర్ ఆదిబాబు దంపతులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జనుపెల్ల అమ్మవారికి సారె

అమలాపురం రూరల్: జనుపెల్ల గ్రామ దేవత జనుపెల్ల అమ్మవారికి ఆదివారం ఘనంగా ఆషాఢ మాసం



మురమళ్లలో ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న గ్రామస్తులు



శాకంబరి దేవిగా విజయదుర్గమ్మ

సారె సమర్పించారు. మేళతాళాలతో శివాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ వివిధ రకాల స్వీట్లు, పుష్పాలు, పసుపు నీళ్ల సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఆలయాన్ని పుష్పాలు, వేప కొమ్మలతో సుందరంగా అలంకరించారు. సారెను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తాండవపల్లి గ్రామదేవత వనువులమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. అనంతరం సారెను గ్రామంలో ఇంటింటికీ



అమలాపురంలో అమ్మవార్లకు ఆషాఢ సారెతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ప్రసాదంగా పంపిణీ చేశారు.

మావుళ్లమ్మకు ఆషాఢ సారె

అమలాపురం రూరల్: ఇందుపల్లి గ్రామ దేవత మావుళ్లమ్మకు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. అమ్మవారికి గ్రామస్తులు వివిధ రకాల స్వీట్లతో నైవేద్యం సమర్పించారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మేళతాళాలతో ఎడ్లబండ్లపై సారెను ఊరేగించారు. వేలాదిగా మహిళలు తరలివచ్చి, గ్రామ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సారెలోని మిఠాయిలను మహిళలు, చిన్నారులు ఇంటింటికీ వెళ్లి పంచారు.

శాకంబరి అలంకరణలో అమ్మవార్లు

ఉప్పలగుప్తం: చల్లపల్లిలో కార్యసిద్ధి కనకదుర్గమ్మ ఆదివారం శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామస్తులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

విజయదుర్గమ్మకు పూజలు

ముమ్మిడివరం: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం మండలంలో పల్లవారిపాలెం విజయదుర్గమ్మ శాకంబరిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి చీర, సారె, తీపి కావిడి సమర్పించారు.



ఇందుపల్లిలో మావుళ్లమ్మకు సారె తీసుకువస్తున్న మహిళలు

మిథున్‌రెడ్డిది కుట్రపూరిత అరెస్టే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేసి కట్టు కథలు అల్లుతూ అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తోంది. ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా అరెస్ట్ చేసింది. కావాలని కేసుల్లో ఇరికించే విధానాన్ని కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగంతో అమలు చేస్తోంది. సాక్ష్యాధారాలు లేకపోయినప్పటికీ గాలిని పోగుచేసి తప్పుడు సాక్ష్యాలను సృష్టించి అక్రమ కేసులు పెడుతోంది. ఇలాంటి అక్రమ కేసుల్లో భాగంగా నాపై కూడా హత్య కేసు నమోదు చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో నన్ను కుట్ర పూరితంగా ఇరికించారు. ఈ అక్రమ కేసులు, అరెస్టులపై కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా కూటమి ప్రభుత్వం తీరు మారడం లేదు. డాక్టర్‌గా సమాజానికి సేవలందిస్తూ నాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి వస్తే నన్ను కూడా టార్గెట్ చేశారు. రాజకీయ కక్షతో ప్రతి ఒక్కరినీ వేధించి జైలుకు పంపించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుంది. ఈ అరాచక ప్రభుత్వానికి ముగింపు పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మాకు న్యాయ వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది.

– డాక్టర్ పినిపే శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, అమలాపురం నియోజకవర్గం

అక్రమ అరెస్టులు దారుణం

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండలానికి చెందిన పలువురు నాయకులు విమర్శించారు. అమలాపురం నియోజకవర్గం సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచె రమణారావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజకుమారి, జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలి వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో కూటమి నాయకులకు తగిన బుద్ధి చెబుతారని వారు పేర్కొన్నారు.

రేపు 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ' సమావేశం

తాళ్లరేవు: ఈ నెల 22న తాళ్లరేవులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ ఆదివారం తెలిపారు. స్థానిక పాత స్టేట్ బ్యాంక్ ఎదురుగా గల సూర్యభాస్కర ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, పార్టీ నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, ముమ్మిడివరం నియోజకవర్గ నాయకులు, మండల పార్టీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని గోవిందకుమార్ కోరారు.

అమలాపురం టౌన్: 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ' పై చర్చించేందుకు అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశం స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో మంగళవారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నట్టు పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని ఆదివారం తెలిపారు. అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వార్డు, గ్రామాల పార్టీ ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి విధిగా హాజరై విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు బులినాని విజ్ఞప్తి చేశారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలకు చార్జీల షాక్

అమలాపురం టౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు చార్జీల షాక్ తగులుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ అన్నారు. అమలాపురం వెంకటేశ్వర ప్లాజా సమావేశపు హాలులో ఆదివారం నిర్వహించిన రెండో రోజు సీపీఐ జిల్లా మహాసభల్లో ప్రభాకర్ మాట్లాడారు. పట్టణాలు, గ్రామాల్లో ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభాకర్ హెచ్చరించారు. తొలుత సీపీఐ జెండాను పార్టీ నాయకుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ ఆవిష్కరించారు. పార్టీ జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నాయని వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, పార్టీ నాయకులు దేవ రాజేంద్ర ప్రసాద్, పెద్దిరెడ్డి రాము, నిమ్మకాయల శ్రీనివాస్, ప్రజా నాట్య మండలి గాయకులు వి.శామ్యూల్, ప్రేమానందం, శారద, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

అమలాపురం రూరల్: రోళ్లపాలెం గున్నపంతులు అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య కృష్ణమూర్తి, బూడిద వెంకటేశ్వరరావు, అక్కిరాజు ఫణిబాబుకు ఆదివారం పాఠశాలలో వీడ్కోలు సత్కార సభ ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం బొంతు వరప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట వైదేహి సాయి రామారావు, ఎంపీటీసీ నేదునూరి నాగరత్నం నథానియేలు, ఉప సర్పంచ్ సింహాచలం, మాజీ సర్పంచ్ రంకిరెడ్డి సూర్యనారాయణ(అబ్బులు), విద్యా కమిటీ చైర్ పర్సన్ చుట్టుగుళ్ల తలుపులమ్మ, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ పిల్లా భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.